ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 304 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం12 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## ప్రశాంతంగా ముగిసిన
# పుర ఎన్నికల పోలింగ్

**రాష్ట్రవ్యాప్తంగా 116 పుర, 7 కార్పొరేషన్లలో ముగిసిన పోలింగ్.. పలుచోట్ల స్వల్ప ఘర్షణలు**

**ఉదయం మందకొడిగా సాగినా మధ్యాహ్నం తరువాత ఊపందుకున్న పోలింగ్**




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో పుర, నగరపాలక ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,981 వార్డుల్లో పోలింగ్ నిర్వహించగా అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్ : మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనల మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్ఈసీ ఏర్పాటు చేసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో కౌన్సిలర్ల ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే తొమ్మిది పురపాలికల్లోని 12 వార్డుల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాల్టీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. అన్ని మున్సిపాల్టీల్లో కలిపి 10,719 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పుర ఎన్నికలకు సంబంధించి 6,017 పోలింగ్ కేంద్రాలను ..మిగతా 2లో



## మున్సిపల్ ఎన్నికల్లో
# కాంగ్రెస్‌దే హవా
### పీపుల్స్ పల్స్ అంచనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ ముగిసింది. ఈనెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు 'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్ సర్వే తెలిపింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కొనసాగుతుందని పేర్కొంది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను భాజపా కైవసం చేసుకునే అవకాశాలున్నాయని, ఈ రెండు కార్పొరేషన్లలో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించనుందని అంచనా వేసింది.

రాష్ట్రంలోని 68-76 మున్సిపాలిటీలను హస్తం పార్టీ, 29-36 మున్సిపాలిటీలను బీఆర్ఎస్, 3-5 మున్సిపాలిటీలను భాజపా, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 8-14 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ ఉందని పేర్కొంది. మొత్తం 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్‌కు 36 శాతం, బీఆర్ఎస్‌కు 29.7 శాతం, భాజపాకు 19.3 శాతం, ఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించింది.

కాంగ్రెస్ పార్టీ 1210-1290 వార్డుల్లో, ..మిగతా 2లో

## రాష్ట్రవ్యాప్తంగా 73.03 శాతం పోలింగ్ నమోదు

**అత్యధికంగా చౌటుప్పల్‌లో, అత్యల్పంగా నందికొండలో ఓటింగ్**

**ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు, 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక**



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో పురపాలక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, ఏడు కార్పొరేషన్ల పరిధిలో 66.05 శాతం పోలింగ్ నమోదు కాగా, 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా .మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న
# పలువురు ప్రజాప్రతినిధులు

**పుర పోలింగ్ : కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఓటు**

**మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పలువురు ప్రజాప్రతినిధులు**

**కొడంగల్‌లో రేవంత్ రెడ్డి, మధిరలో భట్టి, నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నిజామాబాద్‌లో మహేశ్ కుమార్ గౌడ్**













**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుని, శంషాబాద్ నుంచి దిల్లీకి బయలుదేరారు. ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా ఎవరెవరు, ఎక్కడెక్కడ ఓటు వేశారంటే?

ప్రణాళిక వేసుకుని వెళ్తున్నాం : ఓటు వేసిన అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక ..మిగతా 2లో



2లో..

## శివ భక్తులకు గుడ్ న్యూస్

**శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు**

**మహాశివరాత్రి భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు**

**రాష్ట్రంలోని 43 శైవక్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులు**

**ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళలకు ఉచిత రవాణా సదుపాయం**

# ముంబయి మేయర్‌గా రితూ తావ్డే

**గత 25 ఏళ్లలో భాజపాకు దక్కడం ఇదే తొలిసారి**

**ముంబయి, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**



ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.



2లో..

## సీఐపై చర్యలు తీసుకోవాలని
# జగ్గారెడ్డి డిమాండ్

**సీఐ కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నారని ఆరోపణ...**

**జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం**

**పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం**

**పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం**

# ప్రశాంతంగా ముగిసిన
# పుర ఎన్నికల పోలింగ్

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

21174 పొలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు : రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లకు ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 414 వార్డులకు గాను రెండుచోట్ల ఏకగ్రీవం కావడంతో 412 డివిజన్లలో ఎన్నికల కోసం 21,174 పొలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లలో 2,225 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ 410, బీఆర్ఎస్ 401, బీజేపీ 382 అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఆమ్‌ఆద్మీ పార్టీ 12, బీఎస్పీ 44, సీపీఎం 10, ఎంఐఎం 62, ఫార్వర్డ్ బ్లాక్ 122, సీపీఐ 65, జనసేన 81, ఇతర పార్టీలు 55 స్థానాల్లో పోటీ చేయగా 578 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలోని ఒక్కో వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కలిపి 52 లక్షల 17వేల 413 మంది ఓటర్లు ఉన్నారు.

వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ పర్యవేక్షించిన ఈసీ :



రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే గురువారం నిర్వహించనున్నట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీన మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

పలుచోట్ల స్వల్ప ఘర్షణలు : పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. సంగారెడ్డిలో 34 వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి చొక్కాను సీఐ పట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామని బూత్‌లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది.

ఈ క్రమంలో పోలీసులు-జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కి సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా

**మొదటి పేజీ తరువాయి...**

బీఆర్ఎస్ 860-930, భాజపా 250-270, ఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుచుకునే అవకాశముందని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ కూడా గెలిచే అవకాశాలు లేవు.

**కార్పొరేషన్ల వారీగా అంచనాలు..**

రామగుండం: కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, భాజపా 3-6, ఇతరులు 4-7 డివిజన్లు

మంచిర్యాల: కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-9, ఇతరులు 1-2

కొత్తగూడెం: కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4

మహబూబ్‌నగర్: కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, భాజపా 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1

నల్గొండ: కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, భాజపా 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2

నిజామాబాద్: కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, భాజపా 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2

కరీంనగర్: కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, భాజపా 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3



# శివ భక్తులకు గుడ్ న్యూస్ .. శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**మహాశివరాత్రి భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు**

**రాష్ట్రంలోని 43 శైవక్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులు**

**ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళలకు ఉచిత రవాణా సదుపాయం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

మహాశివరాత్రికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని వివిధ శైవక్షేత్రాలకు టీజీఎస్‌ఆర్టీసీ 2243 ప్రత్యేక బస్సులు నడుపాలని నిర్ణయించింది. శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు నడిపిస్తోంది. ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు ఉంటాయని ఆర్టీసీ యాజమాన్యం వెల్లడించింది.

మూడు రోజులు ప్రత్యేక బస్సులు : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్‌ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అధిక టికెట్ ధరలను వసూలు చేయనుంది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడు పాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17వ తేది వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డ్‌లను సంస్థ ఏర్పాటు చేస్తోంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు.

శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ : శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీజీఎస్‌ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లను చేస్తోంది. 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత శివరాత్రి కన్నా ఈ సారి 208 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను ఝఝఝ.్ౖరంతీఏఎబం.అఅ వెబ్సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు.



# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న పలువురు ప్రజాప్రతినిధులు

**మొదటి పేజీ తరువాయి...**

వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదెందుకు క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని వెల్లడించారు.

చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వంలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్న భట్టి గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఒక ఆయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని పొన్నం అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటిలోని 3వ వార్డులోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో కుటుంబ సమేతంగా మంత్రి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్‌లో రెండుచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థుల భర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి మంజుల భర్త శ్రీనివాస్, ఒకటో వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి స్వప్న భర్త విజయ్ భాస్కర్ ఉన్నారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ వద్ద రూ.6 వేలు, విజయ్‌భాస్కర్ వద్ద రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు.

సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఓటు వేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఫోటో దిగారు. నల్గొండ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు వేశారు. నిజామాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట 9వ వార్డులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటు వేశారు జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన జానారెడ్డి : నందికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల 5 వార్డులో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఉన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్మలా పాఠశాల నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత నోముల భగత్ ఓటు వేశారు.

జిల్లాల్లో ఆయా కలెక్టర్లు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ పలు మున్సిపాలిటీలను పరిశీలించారు. భువనగిరి కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు తెలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

# రాష్ట్రవ్యాప్తంగా 73.03 శాతం పోలింగ్ నమోదు

చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. అదే సమయంలో, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అయితే, క్యూ లైన్లలో నిల్చున్న వారికి రాత్రి 7 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు మినహా, పోలింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సాగింది. వృద్ధులు, వికలాంగులకు పోలీసులు సహాయం అందించి ఓటు వేయించారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఎన్నికల్లో 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక, ఫిబ్రవరి 16న వారి ప్రమాణ స్వీకారం ఉంటాయి.

# సీఐపై చర్యలు తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

సంగారెడ్డి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్నసీఐ... కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నారని ఆరోపిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. సీఐపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పలుచోట్ల ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.




# మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్

**జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు.. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది. మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ, హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.శశి కిరణాచారిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. అలాగే.. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్ ప్రాంతాలతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్‌ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ పాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్‌ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. శంషాబాద్ జోన్: ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్. ఖైరతాబాద్ జోన్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట. రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, గోల్కొండ జోన్: గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

# బోరు నీరు కలుషితంతో బుద్వేల్ బృందావన్ కాలనీ ప్రజల ఇబ్బందులు

**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

ఆ కాలనీ పేరు బృందావన్ కాలనీ. ఇది రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో ఉంది. గజానికి రూ.40 నుంచి 50వేలు పెట్టి ఇక్కడ స్థలాలు కొన్న వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారు అందమైన ఇండ్లు కట్టుకున్నారు. పై బస్తీల నుంచి వచ్చే మురుగు నీరు అంతా డ్రైనేజీ కాలువల ద్వారా బృందావన్ కాలనీ మీదుగా మూసీలోకి కలుస్తుం ది. పై బస్తీలలో డ్రైనేజీ పైపు లైను ఉండటం తో అక్కడ ఎలాంటి సమస్య లేదు. బృందావన్ కాలనీ మీదుగా 900 మీటర్ల దూరం వరకు స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ ఉంది. అక్కడ డ్రైనేజీ పైపు లైన్ లేదు. పై నుంచి వస్తున్న మురుగునీరు స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ గూండానే క్రింద ఉన్న డ్రైయినేజీ పైపు లైన్ లోకి వెళుతుంది. బృందావన్ కాలనీ లో ఉన్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ ఓపెన్ నాలాగా ఉండటం, పైన కప్పు మాత్రమే ఉండటంతో మురుగు వరద ఎక్కువగా వచ్చి అది భూ గర్భ జలాలను కలుషితం చేస్తుంది. దానికి తోడు కాలనీ మొదటి వీధి లో ఉన్న ఇండ్ల వారు కూడా తమ డ్రైనేజీ లైన్ ను స్ట్రామ్ వాటర్ డ్రైన్ లోకి కలుపడంతో ఈ సమస్య మరింత ఎక్కువైంది.

**బోరు నీరంత దుర్వాసన :**

బృందావన్ కాలనీ మొదటి వీధి లోని స్ట్రామ్ వాటర్ ద్వారా ప్రవహిస్తున్న మురుగునీరు భూ గర్భజలాలను కలుషితం చేయడం కారణంగా సమీపంలో ఉన్న ఇండ్లలోని బోరు నీరు కూడా కలుషితం అయిపోయింది. పది నుంచి 15 నివాసాల వారు బోరు నీరు వాడుకోవడానికి పట్టుకుందామన్నా అందులో దుర్వాసన వస్తుండటంతో వారు ఆ నీటిని వాడుకోలేని పరిస్థితి నెలకొంది.

**అధికారులు పట్టించుకోవాలి: సోమశేఖర్, బృందావన్ కాలనీ**

బృందావన్ కాలనీ స్ట్రీట్ నెంబర్ 1 లో భూ గర్భ జలాలన్ని కలుషితం అయ్యాయి. రాజేంద్రనగర్ మ



బుద్వేల్ బృందావన్ కాలనీ లో స్ట్రామ్ వాటర్ డ్రైన్ లోనే మురుగు నీరు వెళ్తుందని చూపుతున్న కాలనీ వాసులు

ఎన్సిపల్, జలమండలి అధికారులు స్పందించి సమస్యను గుర్తించి తమకు న్యాయం చేయాలి. భూగర్భజలాలు ఎందుకు కలుషితమౌతున్నాయో చూసి కొత్త పైపు లైన్ వేయాలి. పిల్లలకు, మహిళలకు చర్మ వ్యాధులు వస్తున్నాయి. కార్పోరేటర్ నాలుగు సంవత్సరాలైన ఒక్క సారి మా వీధికి రాలేదు.



**శాఖల మధ్య సమన్వయం లేదు వెంకట క్రిష్ణ, బృందావన్ కాలనీ :**

తమ కాలనీలో భూ గర్భ జలాలు కలుషితమౌతున్నాయని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయానికి వెళితే ఆ సమస్యను జలమండలి అధికారులకు చెప్పుకోండి అని చెబుతున్నారు. జలమండలి అధికారుల వద్దకు వెళితే స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ నిర్మించిన మున్సిపల్ అధికారులు, డ్రైయినేజీ పైపు లైన్ నిర్మిం చలేదని అది వారి తప్పు అని మున్సిపల్ అధికారులనే అడగాలని వారు చెబుతున్నారు. తమ బాధ ను ఎవరికి చెప్పుకోవాలన్నారు.



**ఎమ్మెల్యేకు చెప్పినా, కార్పొరేటర్ కు చెప్పిన మా సమస్య పరిష్కారం కాలేదు : శ్రీనివాస్ రెడ్డి, బృందావన్ కాలనీ :**

బృందావన్ కాలనీలో భూ గర్భ జలాలు కలుషిత మయ్యాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృ ష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండ పోయింది. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి. ట్యాంకర్ల పైన ఆధార పడి జీవిస్తున్నాం. ట్యాంకర్లు తీసుకోవాలన్నా ఇబ్బందిగా ఉంది. బోరు నీరు వాడుకోవాలన్నా వాడుకోలేని పరిస్థితి నెలకొంది. 15 ఇండ్ల వరకు ఈ సమస్య ఉంది. అధికారులు స్పందిం చి న్యాయం చేయాలి.




**బృందావన్ కాలనీ వీధి నెంబర్ 1 లో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణానికి అంచనాలు వేశాం : మహ్మద్ సాజిద్ అలీ, జలమండలి మేనేజర్, రాజేంద్రనగర్ డివిజన్**

గతంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు 900 మీటర్ల మేర నిర్మించిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ లోనే సమీపంలోని ఇండ్ల వారు డ్రైనేజీ లైన్ లు కలుపుకున్నారు. దాంతో సమస్య తలెత్తింది. కాలనీ ప్రజల కోరిక మేరకు సమస్యను పరిశీలించాం. కాలనీలో క్రింది వైపు వరకు ఉన్న డ్రైనేజీ పైప్ లైన్ వరకు 800 మీటర్ల మేర డ్రైనేజీ పైపు లైన్ వేయడానికి అంచనాలు తయారు చేశాం. ఆ పనులకు మంజూరు లభిం చిన వెంటనే పైపులైన్ వేస్తాం. అప్పుడు సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

# బీజేపీ నేత దివంగత బండి ప్రతాప్ రెడ్డి 82వ జయంతి వేడుకలు



దివంగత బండి ప్రతాప్ రెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఆయన కుమార్తె ఝాన్సీ రెడ్డి, మనుమలు



దివంగత బండి ప్రతాప్ రెడ్డి



బండి ప్రతాప్ రెడ్డి చిత్ర పటం వద్ద మహిళా నాయకులు ఎం యాదమ్మ యాదవ్, పి ఉమా మహేశ్వరి తదితరులు

**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

బీజేపీ సీనియర్ నాయకుడు, దివంగత బండి ప్రతాపరెడ్డి 82వ జయంతి కార్యక్రమాలను బుధవారం ప్రేమావతి పేట్ లోని ఆయన నివాసంలో నిర్వహించారు. బండి ప్రతాప్ రెడ్డి కుమార్తె, కాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు దుంబాల ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది. మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు , ప్రేమావతి పేట్ కు చెందిన ప్రజలు ఈ సందర్భంగా బండి ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, మాజీ కౌన్సిలర్ గా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఆయన పార్టీ కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. బండి ప్రతాపరెడ్డి గొప్ప దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా నాయకుల యాదమ్మ యాదవ్, పి ఉమామహేశ్వరి, వసంత, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తలారి అశోక్‌కు మాతృ వియోగం



తలారి రుక్కమ్మ భౌతిక కాయం పై పూల మాలలు ఉంచి నివాళులు అర్పిస్తున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి



తలారి రుక్కమ్మ



తలారి రుక్కమ్మ భౌతిక కాయం వద్ద వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిదులు


**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గగన్ పహడ్ నివాసి తలారి అశోక్, తలారి శ్రీరాముల, లక్ష్మీ బాయి ల మాతృమూర్తి తలారి రుక్కమ్మ (75) మంగళవారం రాత్రి మృతి చెందారు. రుక్కమ్మ మరణవార్త గురించి తెలుసుకున్న బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి బుధవారం గగన్ పహడ్ లోని రుక్కమ్మ నివాసానికి వచ్చి ఆమె భౌతిక కాయ ల పై పలుల మాలలు ఉంచి నివాళులర్పించారు. తలారి అశోక్ తో పాటు తలారి శ్రీరాములు, రుక్కమ్మ కుమార్తె లక్ష్మీభాయి లను ఓదార్చారు. తలారి రుక్కమ్మ మరణవార్త గురించి తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ సదాలక్ష్మీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు వనం నర్సింహ్మ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, పోతురాజు యాదయ్య మాదిగ, వివిధ పార్టీల నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి , పి జీవన్ దాస్, శీలం తిరుపతి రెడ్డి, పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్ వెంకటేశ్, జాలిగం చిత్తారి. కె. ఎస్ దయానంద్. ఎడ్లకాడి సూర్యం, గుంటి సురేశ్, పలుగుచెరువు మహేష్. అనుముల జాన్ పాల్, ఎన్ దనుంజయ్, యాదయ్య, సామ ఇంద్రపాల్ రెడ్డి, జోగి రవి, వంగూరు శ్రీనివాస్, జోగి శేఖర్, కొంపల్లి జగదీశ్, గుంటి శోభ, గుంటి రాజ్ కుమార్ , సీనియర్ జర్నలిస్టు అ ప్పారెడ్డిగూడెం భీమయ్య తదితరులు ఆమె నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. 40 సంవత్సరాల క్రితం తలారి అశోక్ తండ్రి తలారి దుర్గయ్య మరణించారు. అప్పటి నుంచి ముగ్గురు పిల్లలను తలారి రుక్కమ్మ కంటికి రెప్పలా పెంచింది. గగన్ పహాడ్ లో బుధవారం రుక్కమ్మ సమాధి కార్యక్రమాలు జరిగాయి.

# జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం




తార్నాక లోని హుడా కాంప్లెక్స్ లో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన టి. వినయ్ కృష్ణా రెడ్డి



సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ గా హైటెక్ సిటీలోని న్యాక్ భవనంలో బాధ్యతలు స్వీకరించిన సృజన..



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా కొనసాగనున్న ఆర్ వీ కర్ణన్



మూడు కార్పొరేషన్ లకు స్పెషల్ ఆఫీసర్ గా నియమితులైన జయేష్ రంజన్

జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ లను కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు. జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగింపు . సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డిలను నియమించిన ప్రభుత్వం. మూడు కార్పొరేషన్ లకు స్పెషల్ ఆఫీసర్ గా జయేష్ రంజన్.. జయేష్ రంజన్ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లో స్పెషల్ చీఫ్ సెక్రటరీ గా కొనసాగుతున్నారు



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీ జే పీ నాయకులు

# హైదర్ గూడలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

అంత్యోదయ పథకం ద్వారా సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలను తీసుకువెళ్లాలని పిలుపునిచ్చిన మానవతావాది దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని మాజీ కార్పొరేటర్ మోంద్ర సంగీత, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం కొమురయ్య, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్ మల్లారెడ్డి లు అన్నారు. జనతా పార్టీ వ్యవస్థాపకులు దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగె వెంకటేశ్ ఆధ్వర్యంలో హైదర్ గూడ చౌరస్తా లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, రాచూరి రాజశేఖర్, విజయానంద్ రెడ్డి, సిద్దేశ్వర్, నల్లింగ్ రమేశ్, కిరణాచారితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



హైదర్ గూడ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను జీహెచ్ఎంసీలో కలుపడంపై నిరసన

**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ లను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తు బుధవారం హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు చెట్టిగారి నరేందర్ రావు నాయకత్వంలో హైదర్ గూడ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను నూతనంగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కలుపాలని మెజారిటీ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు విన్నవించుకున్నా. నిరసన లు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లను సైబరాబాద్ లో కొనసాగింపచేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాష్రెడ్డి, పోరెడ్డి దర్మారెడ్డి, రావుల జంగయ్య, జాలిగం చిత్తారి. నల్లింగ్ అజయ్ కుమార్, శ్రీవర్ధన్ రెడ్డి ,సదానంద్, రాజేశ్, గిరి, ముఖేశ్, హరీష్, ఆనంద్, ప్రవీణ్, మదు. యాదగిరి. సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

# బుద్వేల్ మూసి పక్కన మోడల్ శ్మశాన వాటిక నిర్మించాలి

**కాలనీలు పెరుగుతున్నాయి... మరి శ్మశాన వాటిక ఎక్కడ**

**వచ్చే ఎన్నికలలో పార్టీల నాయకులను అడిగి సాధించుకోవాలి**

రాజేంద్రనగర్‌లో ఈరోజు చూస్తుంటే, మునుపెన్నడూ లేనటువంటి అభివృద్ధి, మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత 30 ఏళ్ల క్రితం మారుమూల గ్రామంగా ఉన్న ప్రాంతం, ఈరోజు ప్రధానమైన మోడల్ రాజేంద్రనగర్ నియోజకవర్గంగా ఎదగడం అతిశయోక్తి కాదు. ఈ అభివృద్ధికి కృషి చేసిన నాయకులకు శతకోటి వందనములు. పేరుపేరునా అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

అయితే, ఇన్ని మార్పులు జరిగినప్పటికీ, దశాబ్దాలుగా బుద్వేల్ గ్రామంలో స్మశాన వాటికలు ఉన్న ఒక మోడల్ స్మశాన వాటిక లేకపోవడం విచారకరం. గత పది సంవత్సరాలుగా ఈ అంశంపై ఎన్నో సమావేశాలు జరిగినా, అవి తర్వాత నిర్వీర్యం కావడం బాధాకరం.

కొత్త కాలనీలు ఏర్పడటం, డ్రైనేజ్, రోడ్లు, ఎలక్ట్రికల్ లైన్లు వంటి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్న ఈ సమయంలో, కొత్తగా ఏర్పడినటువంటి కాలనీ నివాసతులకు, బుద్వేల్ గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఒక మోడల్ స్మశాన వాటిక నిర్మించడం అత్యవసరం.

రాబోయే జిహెచ్ఎంసి కార్పొరేషన్ ఎన్నికల సందర్భంలో, ప్రతి కాలనీ వాసులు తమ ప్రతినిధులను ప్రశ్నించి, ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరుతున్నాను.

కిస్మత్‌పూర్ ఉ బిర్జు వైపు వెళ్తున్న ప్రాంతంలో, మూసీ నది పక్కన ఉన్న అనుకూల స్థలంలో , మరి ఎక్కడైనా మూసి నది పక్కన ఒక ఆధునిక, శుభ్రమైన మోడల్ స్మశాన వాటిక నిర్మించాలని గ్రామ ప్రజల తరఫున, కొత్తగా ఏర్పడిన కాలనీ అధ్యక్షుల తరఫున, అలాగే అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సీనియర్ నాయకులను మరీ మరీ వేడుకుంటున్నాను.

బుద్వేల్ గ్రామం కొత్తఉపాత నివాసితుల సమిష్టి కృషితో అభివృద్ధి చెందుతోంది. అదే విధంగా, ఈ మౌలిక సదుపాయం కూడా త్వరలోనే సాకారం కావాలని ఆశిస్తున్నాను.

**బి. శ్రీనివాస సాయి కృష్ణ కాలనీ**

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

## నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో భారీగా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు





**పటాన్ చెరు, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం):**

తొలిసారిగా మున్సిపాలిటీలు ఏర్పడిన పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇటీవల మున్సిపాలిటీలు ఏర్పడిన గడ్డపోతారం, గుమ్మడిదల, జిన్నారం, ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ ప్రాంతాల్లో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీల వారీగా జిల్లా అధికారులు అందించంచిన అధికారిక సమాచారం ప్రకారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో 18 వార్డులలో 6285 మంది పురుషులకు గాను 5334 మంది,5696 మహిళలకు గాను 4981 మొత్తం 11983 మందికి 10315 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం తో 86.08 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుమ్మడిదల 22 వార్డులలో 12022 మంది పురుషులకు గాను 9619 మంది, మహిళలు 11901 మంది గాను 9895 మంది మొత్తం 23926 మందికి గాను 19514 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం తో 81.56 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలో 6061 పురుషులకు గాను 5580 మంది, 6414 మంది మహిళలకు గాను 5769 మంది, మొత్తం 12479 మందికి 11350 ఓటు హక్కును వినియోగించుకోవడం తో 90.98 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 26 వార్డు లలో 18778 మంది పురుషులకు గాను 14831 , మహిళలు 17133 మందికి గాను 14097 మంది, ఇతరులు 1 తో కలిపి 35912 ఓటర్లలలో 28928 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం తో 80.55 శాతంగా ఇక్కడ ఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో 6519 మంది పురుషులకు గాను 5525 మంది, 6566 మంది మహిళలకు గాను 5576 మంది, ఇతరులు 1 తో కలిపి మొత్తం 13086 ఓట్లకు గాను 11102 మంది ఓటు హక్కును వినియోగించుకోవడం తో 84.84 ఓట్ల శాతం నమోదు అయినట్లు జిల్లా అధికారులు అందించంచిన అధికారిక ప్రకటన లో పేర్కొన్నారు. అక్కడక్కడా జరిగిన చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకోవడంతో అభ్యర్థుల గెలుపు మహిళా ఓటర్ల మొగ్గు చూపిన పార్టీ వైపు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అధికార పార్టీకి మహిళలు ఓటు వేసారా లేదా ప్రతిపక్ష పార్టీకి మద్దతుగా నిలిచారా అనే విషయం తేలాలంటే మరో రెండు రోజులు పాటు ఎదురు చూడాల్సిందే.




## విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన అవసరం

**పటాన్ చెరు, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం):**

విద్యార్థులు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని క్వాల్కామ్ సంస్థ ఆధ్వర్యంలో అక్షయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన వైద్య శిబిరంలో నిర్వాహకులు సూచించారు. బుధవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బిసి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




## జనగామ మున్సిపాలిటీ 5వ వార్డులో ఓటు హక్కు వినియోగించుకున్న... జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**



జనగామ మున్సిపాలిటీ ఎన్నికల్లో 5వ వార్డులో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో... జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## ఓటు హాక్కును వినియోగించుకున్న డాక్టర్ జైన రమేష్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం):**



జనగామ మున్సిపాలిటీ లో బుధవారం ఎన్నికల సందర్బంగా 27 వ వార్డు బిఆర్ఎస్ డాక్టర్ జైన రమేష్ తన ఓటు హాక్కును రైల్వేస్టేషన్ రోడ్డు లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో వినియోగించుకున్నారు. ఈ సందర్బంగా అభ్యర్థి తన విజయం కాయం మన్నారు.





# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో తప్పిదాలకు తావివ్వకుండ చర్యలు

## జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా,ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా,తప్పిదాలకు తవ్విపకుండా,సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లాలో 6 మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి చేవెళ్ల మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.పోలింగ్ నిర్వహణను,ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు.పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లుకు తావ్వివకుండా సజావుగా నిర్వహించాలన్నారు.సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి ఎవ్వరిని అనుమతించకూడదనీ,ఎలాంటి తప్పిదాలకు తావ్వివకుండా ప్రశాంతగా చేపట్టాలని కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు.




## పరిశ్రమలలో భద్రతపై అవగాహన సదస్సు

**పటాన్ చెరు, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం):**

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గత రెండు రోజులుగా సంగారెడ్డి జిల్లా ఖాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని మ్యాట్రిక్స్ ఫార్మా కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో "ప్రాసెస్ సేఫ్టీ మేనేజ్‌మెంట్" అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమం 10 వ తారీఖున న యూనిట్‌ఉ1లో 11న యూనిట్‌ఉ2లో జరిగింది.ఈ సందర్భంగా మెదక్ ప్రాంత డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి. నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో తన అనుభవాలను పంచుకున్నారు. పరిశ్రమల్లో ప్రాసెస్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వంటి అత్యంత కీలక అంశంపై వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని, ఇందులో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. యూనిట్‌ఉ1 మరియు యూనిట్‌ఉ2లో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తూ, నిర్వాహకులను అభినందించారు. బాధ్యతతో కూడిన పరిశ్రమల అభివృద్ధికి ఇటువంటి సాంకేతిక కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, ఇది కేవలం సాంకేతిక పరిణితిలోనే కాకుండా సమాజ భద్రతకు కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ప్రాసెస్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం మనుషుల ప్రాణాలు, పర్యావరణం, ఆస్తులు మరియు సమాజాన్ని రక్షించడం. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, విషవాయువుల విడుదల వంటి పెద్ద ప్రమాదాలను నివారించడం దీని ముఖ్య లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సేఫ్టీ హెడ్ డి. దామోదరం రెడ్డి , యూనిట్‌ఉ1 ప్లాంట్ హెడ్ బి. నాగేశ్వరరావు, యూనిట్‌ఉ2 ప్లాంట్ హెడ్ ఆర్. శ్రీపతి , అన్ని విభాగాల ఉద్యోగులు మరియు సమీప పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం) :**




ఓటు వేసిన కలెక్టర్ దంపతులు

జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభ మైంది. పోలింగ్ ప్రారంభమై నప్పటి నుంచే ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాల కు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తన భార్య డాక్టర్ సయ్యద్ అమ్రిన్ దంపతులు జనగామలోని హైదరాబాద్ రోడ్డులోని సెయింట్ మేరీస్ స్కూల్లో తమ ఓటు హక్కు ను ఉపయోగించుకున్నా రు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద తాగు నీరు, ర్యాంపులు, వీల్ చైర్లు తదితర మౌలిక సదుపా యాలు సమృద్ధిగా కల్పించి నట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా పారదర్శకంగా కొనసాగింద న్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో జనగామ జిల్లాలో 80.66 శాతం ఓటింగ్ నమోదు

### జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్


**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**



జనగామ మున్సిపల్ పట్టణంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల 30 వార్డులకు గాను పోలైన 34821 ఓట్లలలో పురుషులు 16914 ఓట్లు, మహిళలు 17898 ఓట్లు ఇతరులు 9 ఓట్లు పోలైనాయి. జనగామ మున్సిపల్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 79.06 శాతం నమోదైందని జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించారు. జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల 18 వార్డులకు గాను 15670 మొత్తం ఓట్ల పోలవగా 7620 మంది పురుషులు, 8049 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఒక ఓటు వేసినట్లు స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో మొత్తంగా 84.47 శాతం జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించారు. జనగామ, స్టేషన్ ఘనపూర్ రెండు మున్సిపాలిటీలో 80.66 శాతం ఓటింగ్ జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా షేక్ ధృవీకరించారు.

## సీనియర్ జర్నలిస్టు అకాల మృతి

**పటాన్ చెరు, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం):**



రామచంద్రపురం ఆంధ్రజ్యోతి విలేఖరి సుందర్ రాజ్ అకాల మరణం పట్ల పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామచంద్రపురం మండల పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారంలో సుందర్ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతోపాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అంశంలో విలువైన సలహాలు అందించే వాడని ఆయనను గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడుని కోరుకుంటున్నట్లు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ప్రభాత ఉదయం

# జలమండలి ఈడీగా ఉన్న మయాంక్ మిట్టల్ జాయింట్ ఎండీగా నియామకం

## మర్యాదపూర్వకంగా ఎండీని కలిసిన నూతన జాయింట్ ఎండీ, ఈడీలు.. కోర్ అర్బన్ రీజియన్ వరకు జలమండలి పునర్వ్యవస్థీకరణ

## పరిధి విస్తరించడంతో కొత్త జాయింట్ ఎండీ, ముగ్గురు అధికారులను ఈడీలుగా నియమించిన ప్రభుత్వం

## గురువారం బాధ్యతల స్వీకరించిన జాయింట్ ఎండీ, ఈడీలు







సంతోష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం)**

జలమండలి పరిధిని కోర్ అర్బన్ రీజియన్ వరకు పునర్విభజన విస్తరణలో భాగంగా జోన్లుగా సర్కిళ్లు, సర్కిళ్లుగా సబ్ డివిజన్లు, వార్డులుగా సెక్షన్లలతో విభజించడంతో జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలి కొత్త రూపు సంతరించుకుంది. ఈ పునర్వ్యవస్థీకరణ భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం జలమండలిని కొత్తగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరిలుగా మూడు జోన్లు ఏర్పాటు చేశారు. ఓ ఆర్ ఆర్ వరకు వేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ప్రాంతంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, పౌర సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్ ను జాయింట్ ఎండీగా నియమించిన ప్రభుత్వం.. కొత్త విభజన ప్రకారం మల్కాజిగిరి జోన్ కి పంకజ, హైదరాబాద్ జోన్ కి సామ్రాట్ అశోక్, సైబరాబాద్ జోన్ కి సంతోష్ లను నియమిస్తున్నట్లు గురువారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జలమండలిలో జాయింట్ ఎండీగా పదోన్నతి పొందిన మయాంక్ మిట్టల్ బుధవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితోపాటు ప్రభుత్వం ముగ్గురు ఈడీలు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్ లను సైతం ఆయా జోన్లలో బాధ్యతలు స్వీకరించారు.

**జలమండలి కొత్త జాయింట్ ఎండీ మయాంక్ మిట్టల్:**

ప్రస్తుతం జలమండలి ఈడీగా పని చేస్తున్న మయాంక్ మిట్టల్ ను జాయింట్ ఎండీగా ప్రభుత్వం నియమించింది.

**మల్కాజిగిరి జోన్:**

కొత్తగా ఏర్పడిన జలమండలి మల్కాజిగిరి జోన్ నూతన ఈడీగా పంకజ బాధ్యతలు తీసుకున్నారు.

**సెంట్రల్(ఖైరతాబాద్)జోన్:**

కొత్తగా ఏర్పడిన జలమండలి హైదరాబాద్ జోన్ నూతన ఈడీగా సామ్రాట్ అశోక్ బాధ్యతలు స్వీకరించారు.

**సైబరాబాద్ జోన్:**

కొత్తగా ఏర్పడిన జలమండలి సైబరాబాద్ జోన్ నూతన ఈడీగా సంతోష్ బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ ఎండీ, ఈడీలు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.



పంకజ



జలమండలి జే ఎం డి గా పదవి బాధ్యతలు స్వీకరించిన మయాంక్ మిట్టల్



జలమండలి హైదరాబాద్ ఈడిగా పదవి బాధ్యతలు స్వీకరించిన అశోక్ సామ్రాట్ కు పూల మొక్కను అందజేస్తున్న డైరెక్టర్ పర్సనల్ అబ్దుల్ ఖాదర్, చిత్రంలో సీజిఎం ప్రభు



మల్కాజిగిరి జలమండలి ఈడిగా పదవి బాధ్యతలు స్వీకరించిన పంకజకు పుష్పగుచ్చం అందజేస్తున్న జీఎం సునీల్ కుమార్



జలమండలి సైబరాబాద్ జిహెచ్ఎంసి ఈడిగా పదవి బాధ్యతల స్వీకరించిన సంతోష్, చిత్రంలో సిజిఎం నారాయణ



అశోక్

# జలమండలి నూతన డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరణ

## కొత్త రీజియన్లలో ముగ్గురు ఆపరేషన్ డైరెక్టర్లు.. 12 జోన్లకు ఇంచార్జి సీజీఎంల నియామకం



నారాయణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం)**

జలమండలిలో ఆపరేషన్ డైరెక్టర్లుగా ముగ్గురు అధికారులు బుధవారం రోజున ఆయా జలమండలి కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు మొత్తం 12 జోన్లకు ఇంచార్జ్ చీఫ్ జనరల్ మేనేజర్లు సైతం పదవీ బాధ్యతలు చేపట్టారు. జలమండలి పరిధిని కోర్ అర్బన్ రీజియన్ వరకు పునర్విభజన విస్తరణలో భాగంగా మూడు రీజియన్స్ గా విభజించడంతో పునర్వ్యవస్థీకరణ భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం జలమండలిని కొత్తగా హైదరాబాద్ రీజియన్, సైబరాబాద్ రీజియన్, మల్కాజిగిరిలు రీజియన్ లలో మూడు ఆపరేషన్స్ డైరెక్టర్ పోస్ట్ లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జలమండలి డైరెక్టర్ ఆపరేషన్స్-1గా పని చేస్తున్న వినోద్ భార్గవను హైదరాబాద్ రీజియన్ కు ఆపరేషన్స్ డైరెక్టర్ గా నియమించిగా.. కొత్త విభజన ప్రకారం ఓ అండ్ ఎమ్ సీజీఎమ్ గా విధులు నిర్వర్తించిన పి.శ్రీనివాస్ రెడ్డిని మల్కాజిగిరి రీజియన్ కు ఆపరేషన్ డైరెక్టర్ గా నియమించి, సైబరాబాద్ రీజియన్ కు ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, ఓ అండ్ ఎమ్ సీజీఎమ్ గా ఉన్న నారాయణను నియమించారు. దీంతో పాటు మూడు రీజియన్ లలో ఉన్న జలమండలి పరిధిని మొత్తం 12 జోన్లగా విభజించి జోన్ కి ఇంచార్జి ఆఫీసర్ గా చీఫ్ జనరల్ మేనేజర్లను నియమించారు. ప్రస్తుతం జలమండలి చీఫ్ జనరల్ మేజర్లగా పని చేస్తున్న వినోద్ భార్గవ, నారాయణ, ప్రభు, పి. శ్రీనివాస్ రెడ్డి, నాగేంద్ర కుమార్, ఆనంద్ నాయక్ లతో పాటు చీఫ్ జనరల్ మేజర్లగా కొనసాగించారు. వీరితోపాటు జనరల్ మేజర్లగా పని చేస్తున్న ప్రభాకర్ రావు, జాన్ షరీఫ్, సంతోష్ కుమార్, సుబ్రహ్మణ్యంలను ఇంచార్జి చీఫ్ జనరల్ మేజర్లగా నియమించారు.



పి.శ్రీనివాస్ రెడ్డి

## విశ్వవిద్యాలయాల ఉద్యోగులకు

# హెల్త్ కార్డులు ఇవ్వాలి: సామ అమృత్ రెడ్డి

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం)**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వ తలపెట్టిన హెల్త్ కార్డుల విధంగానే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ సామ అమృత్ రెడ్డి కోరారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆరోగ్య శాఖ) , ట్రస్ట్ బోర్డు సభ్యులు , ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు , పెన్షనర్లకు హెల్త్ కార్డ్ (ఆరోగ్య పథకం)అమలు చేయడానికి సమావేశం ఏర్పాటు చేయడమైనది, ఈ సమావేశములో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు విశ్వ విద్యాలయాల ఉద్యోగులకు,పెన్షనర్లకు కూడా పథకం అమలు చేయాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది, ఈ విషయం గతములో కేబినెట్ సబ్ కమిటీ లో మంత్రులు మల్లు భట్టి విక్రమార్క , దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర రాజ నరసింహ,రాష్ట్ర టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాస్ కి కూడా అనేక సందర్భాలలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది, ఈ ప్రతిపాదనలు ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్స్ లో చేర్చి ప్రభుత్వంతో చర్చించడమైనది కావున ప్రభుత్వం విశ్వ విద్యాలయాల ఉద్యోగులకు, పెన్షనర్లకు తప్పకుండా స్కీమ్ ను అమలు చేయాలని ఈ డిమాండ్ సమావేశములో ప్రభుత్వం ముందు పెట్టి చర్చించాలని,గతములో ఆరోగ్య శాఖ మంత్రి యూనివర్సిటీలో ుఖచీుజూా/ూఖ ఉద్యోగ సంఘాల నాయకులకు హామీ ఇవ్వడం జరిగినది, మంత్రిని ఆ సందర్భాలలో కలిసి విజ్ఞప్తి చేశాము,సూత్రప్రాయంగా అంగీకరించి స్కీమ్ అమలు చేసే సందర్భములో తప్పకుండా పరిశీలిస్తామని వాగ్దానం చేసి ఉన్నారు కావున ు+ూా/ుచీ+ూ నాయకులు తప్పకుండా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చి అమలు చేసే విధంగా ప్రయత్నించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డుల విషయంపై చర్చించనున్న సమావేశంలో విశ్వవిద్యాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బియ్యాని జ్ఞానేశ్వర్, సెక్రటరీ జనరల్ అమృత్ రెడ్డి,మహిపాల్ రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ లు కోరారు.



# యువత క్రీడలలో పాల్గొనాలి

## వేముల రామక్రిష్ణ



**బుద్వేల్, ఫిబ్రవరి 11 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర విద్యార్థి ఐక్య వేధిక అధ్వర్యంలో మూడు రోజులుగా రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో రాజేంద్రనగర్ పీకే జట్టు విజయం సాదించింది. ద్వితీయ స్థానంలో బుద్వేల్ జట్టు నిలిచింది. పోటీలలో పాల్గొని విజయం సాదించిన క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర విద్యార్థి ఐక్యవేధిక ఛైర్మన్ వేముల రామక్రిష్ణ బహుమతులతో పాటు నగదు పారితోషికాలను అందజేశారు. ఈ పోటీలలో 33 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఈ శ్రీకాంత్, ఎం సాయి కిరణ్ యాదవ్, "ప్రసాద్, సంతోష్, వేముల బాలు, ప్రణయ్, చేతన్, అమన్, పాపి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

## నేడు కాటేదాన్, మైలార్‌దేవుపల్లి, గగన్ పహాడ్, రాజేంద్రనగర్, కిస్మత్ పూర్, శంషాబాద్‌లలో...

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం)**



కాటేదాన్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో చెట్ల నరికివేత, నిర్వహణ పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. సెక్షన్ పరిధిలో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 15:00 వరకు లక్ష్మీగూడ గ్రామం, హెచ్ పి పెట్రోల్ పంప్ ప్రాంతం, బాలాజీ నగర్, సింధూర కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, అక్షర పాఠశాల, టి ఎన్జీవోస్ కాలనీ , అమ్మ గార్డెన్స్, పయనీర్ కాన్సెప్ట్ పాఠశాల, షామా టెంట్ హౌస్, బాబా టెంట్ హౌస్, ఇండస్ట్రియల్ ప్రాంతం, పద్మశాలిపురం లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ ఈ ప్రవీణ్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**మైలార్ దేవుపల్లిలో...**

మైలార్ దేవుపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్స్ విభాగం నిర్వహణ నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ 33 కె.వి లైన్ స్వల్పకాలిక విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుంది. మైలార్దేవ్పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నుండి ప్రారంభమయ్యే 11 కె.వి అబ్దుల్లా కాలనీ ఫీడర్‌పై ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మొఘల్ క‌ాశాల, అబ్దుల్లా కాలనీ, పటేల్ నగర్, హరిజన్ బస్తీ. మైలార్ దేవుపల్లి గ్రామం విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుండి సాయంత్రం 5 గంటల వరకు మొఘల్ కాలనీ, ప్రగతి కాలనీ, బ్రూదావన్ కాలనీ, రామ కృష్ణ హిల్స్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ సెక్షన్ లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం బుధవారం సరఫరాలో అంతరాయం అంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి హర్షవర్ధన్ తెలిపారు.ఇందిరా గాంధీ సొసైటీ విద్యుత్ సబ్-సటేషన్ చెట్టును నరికివేస్తున్న గగన్‌పహాడ్ విభాగానికి సంబంధించిన కింది ఫీడర్‌లపై విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేరు కొన్నారు. మధ్యాహ్నం 14:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పద్మశాలి పురం, మధుబన్, టీఎన్జీవో కాలనీ, ఆప్కో కాలనీ లలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఏఈ హర్షవర్ధన్ తెలిపారు.

**కిస్మత్ పూర్ లో...**

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజు తెలిపారు. స్నేహిత హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 01:30 వరకు , ఆరే మైసమ్మ ప్రధాన రహదారి, కాళికా నగర్, ఎన్ఎఫ్సీ కాలనీ, మల్లికార్జున నగర్, ఆదర్శనగర్ 1 & 5, న్యూ కేర్ హాస్పిటల్, గాయత్రి నగర్, వికాస్ నగర్, ద్వారకా నగర్, యాదవ మిత్ర కాలనీ, శ్రీరెడ్డి సాయిబాబా కాలనీ, ప్రశాంత్ కాలనీ, ప్రశాంత్ నగర్ కమిటీ హాల్, భారతి నగర్ , మధ్యాహ్నం 02:30 నుండి సాయంత్రం 05:30 వరకు. జన్నారం ఫీడర్ పరిధిలో బ్యాంక్ కాలనీ, గాయత్రి నగర్, యాదవ్మిత్ర కాలనీ, భారతి నగర్, సాయి బాబా నగర్, ప్రశాంత్ నగర్ కాలనీ, బృంధావన్ కాలనీ , మెయింటెనెన్స్ వర్క్స్ కోసం, బృంధావన్ కాలనీ , మెయింటెనెన్స్ వర్క్స్ సంబంధించి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏ ఈ ఎ. మల్లేష్ రాజ్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**రాజేంద్రనగర్ లో...**

రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వేసవి కార్యాచరణ ప్రణాళిక పనుల కింద మైనర్ నిర్వహణ బలోపేతం పనుల కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బుద్వేల్ ఫీడర్‌లో బుధవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. రిసెప్షన్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 01.30 గంటల వరకు. బుద్వేల్ టీచర్స్ కాలనీ, డేవిడ్ ట్రాన్స్‌ఫార్మర్, మెథడిస్ట్ చర్చి, ఇందిరానగర్, యాదవ్ బస్తీ, గ్రీన్ సిటీ, కిష్టమ్మగుట్ట, సాయి కృష్ణ కాలనీ పరిసర ప్రాంతాలు, సులేమాన్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు కుంట ఇమాద్ నగర్, సులేమాన్ నగర్, పహాడి, వాడి ఇ షామ్స్, పరిసర ప్రాంతం ప్రాంతాలు, రాజేంద్రనగర్ ఫీడర్‌లో 2.30 గంటల నుండి సాయంత్రం 05.30 వరకు చిన్న నిర్వహణ , బలోపేతం పనుల కోసం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, రాజేంద్రనగర్, శాంతినగర్, ఏ ఆర్ ఐ గేట్, హన్మాన్ నగర్. సాయి కృష్ణ కాలనీ, బంగారు మైసమ్మ., పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అందుకోసం అసౌకర్యానికి అంతరాయం సమయంలో సిబ్బంది కి సహకరించాలని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ కోరారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో బుధవారం వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. చిన్న గోల్కొండ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10:00 నుండి 14:00 వరకు చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ, సంఘిగూడ, రషీద్‌గూడ, హమీదుల్లా నగర్, పోచేటిగూడ, గొల్లపల్లి, బహదుర్‌గూడ, లక్ష్మి తండా, రాయికుంట ప్రాంతాలలో విద్యుత్ సరఫరా స్వల్పంగా అంతరాయం ఉంటుందని ఏఈ షేక్ భాషా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయా సెక్షన్ల ఇంజనీర్లు కోరారు.

# 12 తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

## యూనియన్ ప్రెసిడెంట్ కే.చెన్నయ్య



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండల లారీల అడ్డా దగ్గర 4 లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 12 దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ గ్రేటర్ లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ కే.చెన్నయ్య అన్నారు.ఈ మేరకు లారీల ఓనర్స్,డ్రైవర్స్,వర్కర్స్ తో మాట్లాడిన సీఐటీయూ స్వామి,ఇతర కార్మికులు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిది

## రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం)**

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా పీఅండ్ టీ కాలనీకి చెందిన మహమ్మద్ అబ్జర్ మోలీయకు కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం చెక్కును మాజీ మేయర్ మహేందర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్, లు అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...పేదలకు ఇలాంటి సీఎం రిలీఫ్ ఫండ్ లు ఎంతో ఉపయోగ పడుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్,నదీం,ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యా సంస్థలను నిబంధనలకు అనుగుణంగా నడపాలి

## తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం)**



ప్రైవేట్ విద్యా సంస్థలను నిబంధనల మేరకు నడపాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ అన్నారు.సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి ప్రాంతంలోని శ్రద్ధ ప్రైవేటు పాఠశాలలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు.పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడటం,ఫైర్ సేఫ్టీ వంటి ప్రాథమిక భద్రతా సౌకర్యాలు లేకపోవడం,సరైన తనిఖీలు జరగకపోవడం వలన విద్యార్థుల ప్రాణ భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన అన్నారు.ఈ ఘటనను ఒక హెచ్చరికగా తీసుకొని,సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ఏదైనా ప్రైవేటు లేదా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే ముందు ఆ పాఠశాల భవనం సురక్షితమా అని ప్రశ్నించారు.అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లే మార్గాలు ఉన్నాయా,ఫైర్ సేఫ్టీ పరికరాలు ఉన్నాయా,ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే విషయాలను తప్పనిసరిగా పరిశీలించాల్సిన అవసరం ఉందని సూచించారు.పిల్లల భవిష్యత్తు మాత్రమే కాదు,వారి ప్రాణ భద్రత కూడా తల్లిదండ్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు,ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు అవుతున్నాయా అనే అంశంపై సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాలని,నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి పాఠశాల విద్యార్థుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని మీసాల లక్ష్మీ నివాస్ పిలుపునిచ్చారు.

# గద్వాల జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ సంతోష్, ఎస్ పి శ్రీనివాసరావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 11(ప్రభాత ఉదయం)**





మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జోగులాంబ గద్వాల జిల్లాలోనీ నాలుగు మున్సిపాలిటీలలో ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గద్వాల పురపాలిక పరిధిలోని దౌదర్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఐజ జెడ్పిహెచ్ఎస్ లో, పర్దిపురం అంగన్వాడి భవనంలో, శాంతినగర్ జెడ్పిహెచ్ఎస్ లో, అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది, ఓటర్లు సెల్ ఫోన్స్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్యను సరిచూసుకొని ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటర్లకు బ్యాలెట్ పేపర్ లు ఇచ్చిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లో వేసేంత వరకు ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆయా వార్డుల పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య తెలుసుకునీ పలువురు ఓటర్లతో మాట్లాడారు. ఆయా పోలింగ్ కేంద్రాల వెలుపల అతికించిన పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి గుర్తుల వివరాలను పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయం ప్రకారం జరిగిన ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు టీ పోల్ యాప్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం ఐదు గంటల లోపల పోలింగ్ కేంద్రాల్లోని క్యూలో నిలుచున్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వడ్డేపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్ ను ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూములలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అక్కడి అధికారులకు సూచించారు. కౌంటింగ్ హాల్స్ లో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయడమే కాక ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడమే కాక సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పి శంకర్, డిఎస్పి మొగిలయ్య, ఆయా మున్సిపాలిటీల ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# రోడ్లపై చెత్త వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

## రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి




**రాజేంద్రనగర్,ఫిబ్రవరి11(ప్రభాత ఉదయం )**

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్తను వేస్తే సహించేది లేదని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి అన్నారు.రోడ్డు పక్కన చెత్తను డంపు చేస్తున్న ఆటో డ్రైవర్ కు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ సురేందర్ రెడ్డి రూ.పదివేల జరిమానా విధించారు.బండ్లగూడ ప్రాంతానికి చెందిన హుస్సేన్ ఆటోలో చెత్తాచెదారాలతో పాటు కుళ్ళిపోయిన ఉల్లిగడ్డను తీసుకువచ్చి ఆర్మీ స్కూల్ ప్రాంతంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో బుధవారం ఉదయం డంపు చేస్తున్నారు.ఇదే సమయంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ వస్తున్న ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి విషయాన్ని గమనించి ఆటో డ్రైవర్ హుస్సేన్ ను ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు.రెండు పక్కన చెత్తాచెదారాలను డంపు చేయడం జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం విరుద్ధమన్నారు.చెత్తను డంపు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఉప కమిషనర్ పదివేల రూపాయల జరిమానా విధించారు.మరోసారి డంపు చేస్తే వాహనాన్ని జప్తు చేస్తామని హెచ్చరించారు.




Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608